నల్లగొండ క్రైం, జూలై 31 : గంజాయిని విక్రయించే నలుగురిని అరెస్టు చేసినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. నిందితుల నుంచి కిలోన్నర గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ 'మిషన్ పరివర్తన్' కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఇందులో నల్లగొండ నుంచి కనగల్‌కు వెళ్లే దారిలో దర్వేశిపురం సమీపంలోని వేద ఫంక్షన్‌హాల్ వద్ద నలుగురు వ్యక్తులు గంజాయి ప్యాకెట్లతో ఉన్నట్లు పక్కా సమాచారం అందిందన్నారు. కనగల్ ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి గంజాయి ప్యాకెట్లు, బైక్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని అదుపులోకి విచారించామన్నారు. నిందితులు నల్లగొండ బృందావన్‌కాలనీకి చెందిన పెద్దగోని అరవింద్, గుర్రంపోడు మండలం చేపూరి గ్రామానికి చెందిన సీత వంశీ, అదే గ్రామానికి చెందిన కొమ్ము అనిల్, కనగల్ మండలం జి.యడవల్లి గ్రామానికి చెందిన చిన్నపాక అరుణ్‌కుమార్‌లుగా గుర్తించామన్నారు. పెద్దగోని అరవిందమ్మ, సీత వంశీ విశాఖపట్టణంలోని గుర్తుతెలియని వ్యక్తుల నుంచి కిలోన్నర గంజాయిని రూ.20 వేలకు కొనుగోలు చేశారన్నారు. ఆ గంజాయిని దర్వేశిపురం వద్ద వారి స్నేహితులతో కలిసి అక్కడ ఉండగా వారిని అదుపులోని తీసుకున్నట్లు తెలిపారు. గంజాయిని కనగల్ చుట్టుపక్కల గ్రామాల్లోని యువకులకు, విద్యార్థులకు చిన్న పొట్లాలుగా చేసి 50 గ్రాములకు రూ.200, 100 గ్రాములు రూ.500లకు విక్రయించాలని చర్చించినట్లు తెలిపారు. గతంలో వీరి వద్ద గంజాయి కొనుగోలు చేసిన 20మంది బాధితులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. గంజాయి సమాచారం తెలిసిన వారు 8712670266 ఫోన్‌నెంబరుకు సమాచారాన్ని అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి విక్రేతలను పట్టుకున్న డీఎస్పీ శివరాంరెడ్డి, చండూరు సీఐ వెంకటయ్య, కనగల్ ఎస్ఐ రామక్రిష్ణ, సిబ్బంది రమేష్, సురేష్, వెంకన్న, వీరయ్య, సర్వరాజ్‌ఖాన్, వెంకట్‌రెడ్డి, జానయ్యలను ఎస్పీ శరత్ పవార్ అభినందించారు.


పోలీసుల అదుపులో అనుమానిత యువకులు

బీబీనగర్, జూలై 31 : యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జైనపల్లి గ్రామశివారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న యువకులను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఉదయం చెరువు సమీపంలో నిర్మానుష్య ప్రదేశంలో ఐదుగురు యువకులు తిరుగుతుండగా గ్రామస్తులు గుర్తించారు. వారిని చుట్టుముట్టి విచారించగా పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో గ్రామస్తులు డయల్-100కు కాల్ చేసి సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రమేష్ సిబ్బందితో వెళ్లి యువకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా యువకులు సంచరిస్తున్న ప్రదేశంలో ఇంజక్షన్లు కనిపించడంతో డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలను సేవించేందుకు వచ్చినట్లుగా గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

నల్లబెల్లం, సారా పట్టివేత

హుజూర్‌నగర్, జూలై 31 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న 120 కిలోల నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మేళ్లచెర్వు మండలం కొత్తవెల్లటూరు కాలనీకి చెందిన దాసు వీరబాబు వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 120 కిలో నల్లబెల్లం, ఐదు లీటర్ల సారా తరలిస్తుండగా దొండపాడు వద్ద తెల్లవారుజామున పట్టుకున్నట్లు తెలిపారు. కాగా నల్లబెల్లం విక్రయించిన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన వ్యాపారి సంకా వెంకట్రావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో నాగరాజు, రవి, రుక్మారెడ్డి, నాగయ్య, గోపిరెడ్డి, మధు పాల్గొన్నారు.





వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

బొమ్మలరామారం, జూలై 31: అతివేగంతో కారు ఆటోను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలో ఈ ఘటన బుధవారం జరిగింది. ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం తుర్కపల్లి మండలం ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన బొడ్డెల్లి బాలయ్య(54) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న అతడి కుమారుడు బొడ్డెల్లి వెంకటేష్‌తో కలిసి ఆటోలో ఇబ్రహీంపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్నాడు. టీఎస్08 ఎఫ్‌డీ 1989 నెంబరు గల కారులో వేమూరి హరిబాబు హైదరాబాద్ నుంచి తుర్కపల్లి మండలం లక్ష్మాపూర్‌లోని ఫామ్‌హౌస్‌కి వెళ్తూ బొమ్మలరామారం గ్రామశివారులో అతివేగంతో కుడివైపు నుంచి వస్తున్న ఆటోను బలంగా ఢీకొనడంతో ఆటో రోడ్డుపక్కన పడిపోయింది. అదేవేగంతో కారు డీసీఎంను కూడా బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న బాలయ్యకు, ఆయన కుమారుడు వెంకటేష్‌కు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బాలయ్య మృతి చెందాడు. అతడి కుమారుడు వెంకటేష్ చికిత్స పొందుతున్నాడు. కారు నడుపుతున్న హరిబాబుకు కూడా గాయాలుకావడంతో ఆసుపత్రికి తరలించారు. బాలయ్య కుటుంబ సభ్యులు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.


బొమ్మలరామారంలో కారు ఢీకొని దెబ్బతిన్న వాహనాలు

కొండమల్లేపల్లి: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేశముఖినికుంట చింతకుంట్ల పంచాయతీకి చెందిన ఏకుల రమేష్(36) టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి కొండమల్లేపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. చిన్నఅడిశర్లపల్లి సమీపంలోని వ్యవసాయ ఉద్యానవవన కేంద్రం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో స్థానికులు చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. రమేష్‌కు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.


రమేష్(ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎనిమిది రోజులుగా చికిత్స పొందుతున్న యువకుడు బుధవారం మృతి చెందాడు. స్థానిక సీఐ రమేష్ బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వంగపల్లి గ్రామానికి చెందిన కానుగంటి వినయ్(20) ఈ నెల 24 రోజున వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై వంగపల్లిలో ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడ్డాయి. ఎనిమిది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వినయ్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రెండు కార్లు ఢీ: ఐదుగురికి గాయాలు

నాగార్జునసాగర్, జూలై 31 : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం వద్ద రెండు కార్లు ఢీకొని ఐదుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి మాచర్ల వైపునకు వస్తున్న కారు, మాచర్ల నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కార్లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో హైదరాబాద్ నుంచి మాచర్లకు వెళ్తున్న కారులోని సిద్ధార్థ, రాజు, సతీష్, సంతోష్, హైదరాబాద్‌కు వెళ్తున్న కారులోని నాగులు, దినకర్‌లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మునుగోడు రూరల్ : నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొంపల్లి గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంపల్లి గ్రామానికి చెందిన గంజి శివ, గంజి పరమేష్‌ల మధ్య భూవివాదం నడుస్తోంది. బుధవారం పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడేందుకు వేర్వేరు సమయాల్లో రావడంతో సమస్య పరిష్కారం కాలేదు. దీంతో పరమేష్ మరొకరితో కలిసి హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా వెనక నుంచి శివ వస్తున్న కారు ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. వ్యక్తిగత కక్షపూరితంగానే ఈ సంఘటనకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

'అవ్వా.. కాస్త నీళ్లివ్వవా'

- ఇచ్చేందుకు లేస్తుండగా వృద్ధురాలి మెడలోని గొలుసు అపహరణ
- వచ్చిన కారులో పరారైన ముగ్గురు
- తులం బంగారు గొలుసు చోరీ


దేవరకొండ, జూలై 31 : 'అవ్వా కాస్త మంచినీళ్లివ్వవా' అంటూ పలకరించి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు అపహరించారు. వచ్చిన కారులోనే ముగ్గురు పరారయ్యారు. ఈ సంఘటన దేవరకొండ మండలం కొండభీమనపల్లిలో బుధవారం సాయంత్రం జరిగింది. సీఐ నర్సింహులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండభీమనపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు కనకటి లక్ష్మమ్మ కుమారుడు, కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉంది. బుధవారం సాయంత్రం గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చి ఒంటరిగా ఉన్న లక్ష్మమ్మను అవ్వా మంచినీరు ఇవ్వవా అని అడిగారు. ఆమె కూర్చున్న చోటు నుంచి లేచేలోగా ఆమె మెడలో ఉన్న సుమారు రూ.60 వేల విలువైన తులం బంగారు గొలుసు అపహరించుకుని కారులో పరారయ్యారు. దీంతో లక్ష్మమ్మ కేకలు వేయగా ఇరుగు పొరుగువారు వచ్చేలోగా వారు పరారయ్యారు. లక్ష్మమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

బొర్రొలగూడెంలో..

చౌటుప్పల్ రూరల్ జూలై 31 : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పంచాయతీ మధిర బొర్రెలగూడెంలో భారీ చోరీ జరిగింది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొర్రొలగూడెం గ్రామానికి చెందిన ములుగు ప్రభాకర్ స్థానిక క్రషర్ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ బంధువుల ఇంటికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. రాత్రి దొంగలు ఇంటి తాళం విరగ్గొట్టి బీరువాలో దాచి ఉంచిన 12 తులాలల బంగారం, రూ.9లక్షల నగదు అపహరించారు. బుధవారం ఇంటి పక్కన ఉన్న స్థానికులు తాళం విరగొట్టిన విషయం ఫోన్ ద్వారా తెలపడంతో ప్రభాకర్ ఇంటికి వచ్చాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం విరగ్గొట్టి ఉంది. బంగారం, నగదు అపహరించినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు

గిరిజనులకు ఇచ్చిన వాగ్ధానాల అమలుకోసం పోరాటం

మఠంపల్లి, జూలై 31 : గిరిజనులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్ధానాల అమలు కోసం ఉద్యమించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్ పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో బుధవారం సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు బాలునాయక్ అధ్యక్షతన జరిగిన జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. పోడు భూముల సాగుచేస్తున్న రైతులకు పట్టాలు ఆగస్టు 15వ తేదీ నాటికి ఇవ్వకుంటే రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టి ప్రభుత్వం ఒత్తిడి తెస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా పట్టాలు ఎలా పంపిణీ చేస్తారో చెప్పడం లేదన్నారు. మఠంపల్లి మండలంలో గిరిజనులకు ఇచ్చిన అటవీ, రెవెన్యూ, ప్రభుత్వ భూములను ప్రైవేటు కంపెనీలు బలవంతంగా ఆక్రమించుకుంటున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆ భూములపై తిరిగి గిరిజనులకు హక్కులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య వీరభద్రంనాయక్, సహాయ కార్యదర్శి ఎం.రవినాయక్, సంఘం సీనియర్ నాయకులు భూక్య పాండునాయక్, వెంకటేశ్వర్లునాయక్, బానోతురాజునాయక్, స్వామినాయక్, బానోతువినోద్‌నాయక్, సమన్‌నాయక్, గోపినాయక్, ప్రజా సంఘాల నాయకులు పల్లె వెంకటరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, వట్టెపు సైదులు, శీలం శ్రీను, హుస్సేన్ పాల్గొన్నారు.





ఎమ్మెల్యే వీరేశంకు చేనేత ప్రతినిధుల సన్మానం


ఎమ్మెల్యే వీరేశాన్ని సన్మానిస్తున్న చేనేత సంఘాల ప్రతినిధులు

చౌటుప్పల్ రూరల్, జూలై 31 : చేనేత కార్మికుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేనేత ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట చేనేత సంఘాల్లో పేరుకుపోయిన వస్త్ర నిల్వలు, చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినందుకు ప్రతినిధులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బోర్డ్ సభ్యుడు భారత వాసుదేవ్, చేనేత సంఘాల అధ్యక్షుడు అప్పం రామేశ్వరం, ప్రతినిధులు పున్నా జగన్‌మోహన్, గంగుల రాజిరెడ్డి, తిమ్మపురం మహేందర్‌రెడ్డి ఉన్నారు.

యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన

భువనగిరి అర్బన్, జూలై 31 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయంలో బుధవారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవ మూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించిన అర్చకస్వాములు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామ పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. గంటపాటు పూజ పర్వం కొనసాగింది.


లక్ష పుష్పార్చన చేస్తున్న అర్చకులు

నిత్యపూజలు

సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువైన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండిజోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రుద్రహవనం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 11,34,384 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా ఆలయ ఉప ప్రధానార్చకుడు పీ భాస్కరాచార్యులు ఉద్యోగ విరమణ సందర్భంగా దంపతులను సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఈవో భాస్కర్‌రావు, ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు, డీఈవో భాస్కర శర్మ, ఏఈవోలు గజవెల్లి రమేష్‌బాబు, రఘు తదితరులు పాల్గొన్నారు.

భర్తతో గొడవపడి
మహిళ అదృశ్యం

కొత్తపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం కొండన్‌పల్లికి చెందిన మహిళ హైదరాబాద్‌లో అదృశ్యమైంది. కొండన్‌పల్లికి చెందిన తండరుపల్లి ఇస్తారి, తండరుపల్లి లక్ష్మమ్మ(45) దంపతులు నాగోల్ సాయినగర్‌లో ఉంటున్నారు. లక్ష్మమ్మ ఖైరతాబాద్‌లోని దక్కన్ గ్రామీణ బ్యాంకులో అటెండరుగా పనిచేస్తోంది. కొండన్‌పల్లిలో వారికి కొంత వ్యవసాయ భూమి ఉంది. సదరు భూమి వివాదం విషయమై ఇద్దరి మధ్య తరచూ గొడవ జరిగేది. జూలై 29వ తేదీన వారిద్దరి మధ్య భూమి విషయంపై గొడవ జరిగింది. మరుసటి రోజు సాయంత్రం లక్ష్మమ్మ వ్యర్థాలు బయట పారబోసి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడు ఆమె ఆచూకీ కోసం అంతటా వెతకినా కనిపించలేదు. బుధవారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


లక్ష్మమ్మ

అనుమానాస్పదస్థితిలో
వ్యక్తి మృతి

దామరచర్ల, జూలై 31 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలో జరిగింది. ఎస్ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం కేంద్రానికి చెందిన కంచరకుంట్ల రమణారెడ్డి(39) స్థానికంగా పాతఇనుము దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. పెనుగులాటలో రమణారెడ్డి తలకు తీవ్రగాయమైంది. అనంతరం రమణారెడ్డి తీవ్ర మనస్తాపంతో పక్క గదిలోకి వెళ్లి ఉరివేసుకున్నాడు. కొంతసమయం తర్వాత గమనించిన భార్య సుమలత తలుపులు తెరిచి చూడగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. రమణారెడ్డి వరుసకు సోదరుడైన చిట్యాల మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు. రమణారెడ్డి తలకు గాయం ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రమణారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.


రమణారెడ్డి (ఫైల్)

నత్తనడకన జంక్షన్ల నిర్మాణం

» పత్తాలేని కాంట్రాక్టర్లు » ఇబ్బంది పడుతున్న వాహనదారులు



హుజూర్‌నగర్‌లో మెయిన్‌రోడ్డులో సీసీ రోడ్డు పక్కన మొరం పోయని దృశ్యం



పట్టణంలోని ఇందిరా సెంటరులో నీటి పైప్‌లైన్ కోసం తవ్వి వదిలేసిన గుంతలు

హుజూర్‌నగర్, జూలై 31: పట్టణంలో రూ.3కోట్లతో సీసీ రోడ్లను నిర్మించినా, జంక్షన్ల వద్ద పనులను పూర్తి చేయనందున వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని వివేకానందుడి విగ్రహం, పొట్టి శ్రీరాములు సెంటరు, మట్టపల్లి బైపాస్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం,లింగగిరి క్రాస్ రోడ్డు జంక్షన్లలో పనులు పూర్తి కాలేదు. పట్టణంలోని ఇంది సెంటరు నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా పాత బస్‌స్టేషన్, పొట్టి శ్రీరాములు సెంటరు నుంచి మట్టపల్లి, యాతవాకిళ్ల, మేళ్లచెర్వు వంటి గ్రామాలకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జంక్షన్ల ప్రాంతంలో పనులు పూర్తి కానందున ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే మెయిన్‌రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. మెయిన్ రోడ్డు పక్కన కిలోమీటర్ల దూరం గోతులను తవ్వి పైప్‌లైన్‌ను నిర్మించారు. ఈ గుంతల్లో డస్ట్ నింపాల్సి ఉండ గా, అలాగే వదిలేశారు. దీంతో మెయిన్ రోడ్డు నుంచి పక్కనే ఉన్న దుకాణాల్లోకి వెళ్లాలంటే మూడు అడుగుల లోతులో గుంతలు ఉన్నాయి. ఇవి ప్రజలు రాకపోకలు సాగించడానికి ఆటంకంగా మారాయి. జంక్షనలో రోడ్ల నిర్మాణం పూర్తికానందున పాత బస్‌స్టేషన్‌కు ఆర్టీసీ అధికారులు బస్సుల ను నడపడంలేదు. దీంతో ప్రజలు గాంధీ పార్కు, పాత బస్‌స్టేషన్ నుంచి కొత్త బస్‌స్టేషన్ వరకు నడవాలి. ఆటోల్లో వెళ్లాలంటే రూ.30 లు చెల్లించాల్సి వస్తోంది. పాత బస్‌స్టేషన్ వరకు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారును ప్రజలు కోరినా ఇందిరా సెంటరులోని జంక్షన్‌లో ఉన్న గుంతలు పూడిస్తేనే బస్సులు నడుపుతామంటూ భీష్మించారు.

దీంతో పట్టణ ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది ఏర్పడింది.. పబ్లిక్‌హెల్త్ అధికారుల నిర్లక్ష్యం కొరవడినందున కాంట్రాక్టర్ నత్తనడకన పనులు చేస్తున్నారని, కొన్ని రోజులుగా కాంట్రాక్టర్లు పత్తాలేకుండా పోయారని స్థానికులు విమర్శిస్తున్నారు.

త్వరలోనే పనులు పూర్తిచేస్తాం

పట్టణంలోని ఇందిర సెంటరు, పొట్టి శ్రీరాములు సెంటర్లలోని జంక్షన్లలో రోడ్డు పనులు త్వరలోనే పూర్తి చేస్తాం. కాంట్రాక్టర్‌కు చెప్పినా పట్టించుకోవడంలేదు. కాంట్రాక్టర్లకు బిల్లు లు రానందున పనుల్లో ఆలస్యం జరుగుతోంది. ఇటీవల వర్షాలు కురవడంతో పనులు సక్రమం గా సాగడంలేదు. త్వరలోనే పనులు పూర్తిచేస్తాం.

\- స్వాతిరెడ్డి, ఏఈ, పబ్లిక్ హెల్త్

లై'సెన్సు' లేకుండా వ్యాపారం

» నిబంధనలు పాటించని దుకాణదారులు » మునిసిపాలిటీల ఆదాయానికి గండి



సూర్యాపేట టౌన్, జూలై 31: నిత్యం వేల నుంచి లక్షల రూపాయలు టర్నోవర్ చేసే పలు దుకాణదారులు, వ్యాపార లావాదేవీలు నిర్వహించడానికి మునిసిపాలిటీ జారీ చేసే లైసెన్సు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంలో వ్యాపార లైసెన్స్ తీసుకోవాలంటే కొంత ఇబ్బందులు ఉండేవి. నూతన మునిసిపాలిటీ చట్టం ప్రకారం.. ప్రస్తుతం అలాంటి ఇబ్బందులు లేకుండా దుకాణం విస్తీర్ణం, రహదారికి ఎంత దూరం, హరితహారం పన్ను వంటి అంశాలను పరిగనలోకి మునిసిపాలిటీ అధికారులు తీసుకుని ఆ మేరకు వ్యాపార లైసెన్స్ ధరను నిర్ణయిస్తున్నారు. ఆస్తి పన్నుకు డబ్బులు చెల్లించినట్లు వ్యాపార లైసెన్స్‌కు డబ్బులు చెల్లించడానికి వ్యాపారులు అంతగా ముందుకు రావడం లేదు. దీంతో మునిసిపాలిటీల ఆదాయానికి గండి పడుతోంది.

లైసెన్సులు లేని సగానికి పైగా దుకాణాలు

ఆర్థిక సంవత్సరం మధ్యలో లైసెన్సు ఫీజు చెల్లించే వ్యాపారులకు మునిసిపాలిటీ అధికారులు ఎటువంటి జరిమానా విధించడంలేదు. ఆ తర్వాత తీసుకుంటే 25శాతం జరిమానాతో పాటు హరిత పన్ను విధిస్తున్నారు. ట్రేడ్ లైసెన్సు తీసుకోవడంతో మునిసిపల్ అధికారులు అంతగా అవగాహన కల్పించడంలేదని వ్యాపారులు తెలిపారు. జిల్లాలోని సదరు మునిసిపాలిటీల్లో మొత్తం 9850 దుకాణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించగా, కేవలం 3857 మంది లైసెన్సులు తీసుకున్నట్లు తెలిసింది. మునిసిపాలిటీల్లో రోజు రోజుకూ కొత్త దుకాణాలు ఏర్పాటవుతున్నాయి. ముఖ్యంగా షాపింగ్‌మాల్స్, హోటళ్లు, కిరాణా దుకాణాలు, షోరూంలు, వస్త్ర దుకాణాలు, వివిధ రకాల వ్యాపార దుకాణాలు అధికంగా పెరుగుతున్నాయి. అయితే అదే రీతిలో వ్యాపార లైసెన్సులు పెరగడంలేదు. వీటిపై మునిసిపల్ అధికారులు ఏమాత్రం దృష్టి సారించడంలేదు.

వ్యాపార లైసెన్సు తీసుకోవాలి

ప్రతి దుకాణదారుడూ వ్యాపార లైసెన్సు తీసుకోవాలి. గతంలో తీసుకున్న లైసెన్సు తీసుకున్నా వ్యాపారులు పునరుద్ధరించుకుని మునిసిపాలిటీ ఆదాయం పెంపునకు సహకరించాలి. వ్యాపార లైసెన్స్ లేని దుకాణాలపై చర్యలు తీసుకుంటాం.

\- శ్రీనివాస్, మునిసిపాలిటీ కమిషనర్, సూర్యాపేట

జిల్లాలో ఐదు మునిసిపాలిటీలు, 141వార్డులు

జిల్లాలో ఐదు మునిసిపాలిటీలు (సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరుడుచర్ల, తిరుమలగిరి) ఉన్నాయి. మొత్తం 141 వార్డులు ఉన్నాయి. సూర్యాపేట పట్టణంలో 48వార్డులు ఉండగా ప్రతి వార్డులో కనీసం చిన్న, మధ్య తరహా వ్యాపార దుకాణాలు 10ఉన్నాయి. కొత్త దుకాణాలు, వ్యాపారాలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. కొంత మంది మాత్రమే తమ వ్యాపారాన్ని విస్తరించడానికి, ఇతర కారణాలతో బ్యాంకు రుణాలు అవసరమైన సందర్భాల్లోనే వ్యాపార లైసెన్స్ తప్పనిసరిగా అవసరమై తీసుకుంటున్నారు. మిగిలిన వ్యాపారులు లైసెన్సు తీసుకోవడానికి అంతగా ఆసక్తి చూపడంలేదు. అయితే ఇటీవల దుకాణాల్లో మునిసిపాలిటీ సిబ్బంది తనిఖీలు చేస్తున్నందున కొంతమంది వ్యాపారులు లైసెన్సు తీసుకోవడానికి ముందుకు వస్తున్నారు.

'శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించాలి'

అనంతగిరి, జూలై 31: మండలంలోని కొత్తగూడెం గ్రామంలోని విశ్వబ్రాహ్మణ శ్మశానవాటికలో ఆక్రమణలను తొలగించాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సర్వే నెం. 236లోని స్థలాన్ని ఐదు దశాబ్దాలుగా శ్మశానవాటికగా ఉపయోగించుకుంటున్నామని, సుమారు 30 కుంటల భూమిని ఓ రైతు కబ్జా చేసేందుకు ఎక్స్‌కవేటర్‌తో చదును చేయిస్తున్నాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కాల్వపై కాంక్రీట్‌తో శాశ్వత వంతెనను నిర్మించాలి

గరిడేపల్లి, జూలై 31: మండల కేంద్రం నుంచి అలింగాపురం వరకు డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా గారకుంటతండా వద్ద సాగర్ కాల్వపై గూనలతో కాకుండా కాంక్రీట్‌తో శాశ్వత వంతెనను నిర్మించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం మండల పరిధిలోని గారకుంటతండ వద్ద సాగర్ కాల్వపై నిర్మిస్తున్న వంతెన పనులను రైతులు, ప్రయాణికులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెండె వెంకటేశ్వర్లు, సాంబయ్య, శంకర్, పుల్లమ్మ పాల్గొన్నారు.

'విభజన హామీలను విస్మరించిన మోదీ ప్రభుత్వం'

హుజూర్‌నగర్, జూలై 31: తెలంగాణ విభజన హామీలను మోదీ ప్రభుత్వం విస్మరించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు విమర్శించారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పట్టణ కౌన్సిల్ నిర్మాణ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో భారీగా అప్పు చేసి దేశాన్ని ఊబిలోకి నెట్టివేసిందని ఆరోపించారు. బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్క రూపాయి నిధులు కూడా కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఈ సమావేశంలో గుండు వెంకటేశ్వర్లు, కొప్పోజు సూర్యనారాయణ, రమేష్, దేవరం మల్లేశ్వరి, సుందరి పద్మ పాల్గొన్నారు.

పీఆర్సీ పెంపు హర్షనీయం

సూర్యాపేట టౌన్, జూలై 31: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కళాకారులకు 30శాతం పీఆర్సీ పెంపు హర్షణీయమని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ చీటూరి నిర్మల అన్నారు. పీఆర్‌సీ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాకారులు గంట బిక్షపతి, పల్లెల రాము, లక్ష్మణ్, నాగలక్ష్మి ప్రియాంక, ప్రియదర్శిని, ఇందిర పాల్గొన్నారు.

వంతెన నిర్మాణాన్ని వాయిదా వేయాలి: రైతులు

మేళ్లచెర్వు, జూలై 31: మండలంలోని జోగుకుంట సమీపంలో ఎన్ఎస్పీ కాలువపై ఉన్న వంతెన నిర్మాణాన్ని వాయిదా వేయాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు. ఇక్కడ గతంలో ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకోవటంతో, దాని పక్కనే మరో వంతెన నిర్మాణాన్ని ఇటీవల ప్రారంభించారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వంతెనను నిర్మిస్తే ఎన్ఎస్పీ కాల్వ ద్వారా పొలాలకు అందే సాగునీటికి ఇబ్బంది ఏర్పడుతుందని, ఈ వానాకాలం సీజన్ పంట ముగిసే వరకు వంతెన నిర్మాణాన్ని వాయిదా వేయాలని రైతులు కోరారు.

వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా చైర్మన్‌గా రమేష్‌గౌడ్

తుంగతుర్తి, జూలై 31: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా చైర్మన్‌గా తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన గోపగాని రమేష్‌గౌడ్‌ని నియమించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారసత్వ పరిషత్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రమేష్‌గౌడ్‌కు నియామకపత్రాన్ని ఎన్సీఆర్సీ జాతీయ చైర్మన్ డాక్టర్ ఎంవీఎల్ నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ శ్రీకాంత్ అందజేశారు.

ఎస్ఐగా ఐలయ్య బాధ్యతల స్వీకరణ



నాగారం, జూలై 31: నాగారం ఎస్ఐగా ఎం.ఐలయ్య బాధ్యతలను బుధవారం స్వీకరించారు. నల్లగొండ సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఐలయ్యకు నాగారం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ఉన్నతాధికారులు నియమించారు.

వెలుగులు నింపడానికే కంటి వైద్య శిబిరం

పెన్‌పహాడ్, జూలై 31: పేద కుటుంబాల్లో వెలుగులు నింపడానికి ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. తన సతీమణి రాంరెడ్డి వరూధినిదేవి జయంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం బుధవారం పెన్‌పహాడ్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మాట్లాడారు. తన కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెన్‌పహాడ్ మండలంలోని 29గ్రామ పంచాయతీల్లో మెగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తానన్నారు. ఈ శిబిరంలో 170మందికి కంటి పరీక్షలు చేయించామని, వీరిలో 37మందికి కంటి ఆపరేషన్లు చేయిస్తామని లయన్స్ క్లబ్ కమిటీ కోశాధికారి చిలుముల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, భాస్కర్, భుజంగరావు, ఎంపీడీవో వెంకటేశ్వర్ రావు, పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

రెడ్డి సంక్షేమ సంఘం సేవలు అభినందనీయం

సూర్యాపేట టౌన్: జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం నిర్వహిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన పన్నాల మహాలక్ష్మి బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా, జిల్లా కేంద్రంలోని వైట్‌హౌస్‌లో జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్ అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గోదాల రంగారెడ్డి, చిలుముల సునీల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అలుగుబెల్లి జగన్మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట 14వార్డు స్నేహనగర్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పలు సమస్యలు పరిష్కరించా లని కోరుతూ జిల్లా కేంద్రంలోని వైట్‌హౌజ్‌లో దామోదర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో స్నేహనగర్ వార్డు కమిటీ సభ్యులు లాలయ్య, వీరన్న, గౌస్, విఠల్, చంద్రారెడ్డి, లింగయ్య, నర్సింహ, మల్లయ్య పాల్గొన్నారు.

పునెం లింగయ్య ఆశయాలను సాధించాలి

సూర్యాపేట టౌన్, సూర్యాపేట, కోదాడ, జూలై 31: ఆదివాసీ పోరాట యోధుడు పునెం లింగయ్య ఆశయాలను సాధించాలని పలువురు వక్తలు అన్నారు. లింగయ్య వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కుడకుడలో, సూర్యా పేటలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో, ఆత్మకూర్(ఎస్) మండ లంలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో, కోదాడలోని లాల్‌బంగ్లాలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, నల్లగొండ నాగయ్య, అరుణోదయ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలు చేసిన లింగయ్య ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా ఉన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శులు కొత్తపల్లి రేణుక, కంచర్ల నర్సక్క, ఎర్ర అఖిల్‌కుమార్, బొడ్డు శంకర్, కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు అలుగుబెల్లి వెంకటరెడ్డి, పోతురాజు ప్రతాప్, కలంచర్ల లింగయ్య, వక్కవంతుల నర్సింహారావు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలి

సూర్యాపేట, జూలై 31: విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు హోల్డర్ డాక్టర్ పెండెం కృష్ణకుమార్ అన్నారు. బుధవారం ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దేశ నాయకులు, శాస్త్రవేత్తల చిత్రపటాలు, మెడికల్ కిట్లు, విటమిన్ సీ టాబ్లెట్స్, ఆట వస్తువులను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వి.శ్రవణ్, ఉపాధ్యాయులు కె.సుదర్శన్, జెచంద్రశేఖర్, టి.అన్నపూర్ణాచారి పాల్గొన్నారు.

తిరుమలగిరిలోనే బస్ డిపో నిర్మించాలి

తిరుమలగిరి, జులై 31: తిరుమలగిరిలోనే బస్‌డిపో నిర్మించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుదవారం మునిసిపల్ కేంద్రంలోని బస్‌స్టేషన్‌లో వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి అఖిలపక్ష కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తిరుమలగిరిలో బస్ డిపో నిర్మిస్తే చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు. తిరుమలగిరిలోనే డిపో నిర్మించాలని అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తిరుమలగిరిలో బస్ డిపో ఏర్పాటుకు ఎమ్మెల్యే మందుల సామేలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో అఖిలపక్ష నాయకులు కడెం లింగయ్య, కందుకూరి సోమన్న, మూల అశోక్‌రెడ్డి, వేల్పుల లింగయ్య, కొండ సోమయ్య, వై దీన్‌దయాల్, నలుగూరి రమేష్, అనంతుల శ్రీను, పోరెల్ల లక్ష్మయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి'

సూర్యాపేట సిటీ, జూలై 31: వ్యవసాయ మార్కెట్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దోమల రమణయ్య అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో నిర్వహించే 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి బుధవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కాంట్రాక్ట్ ఏజెన్సీని రద్దు చేసి, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ~రసింహయాదవ్, నామ సైదులు, షైలవరపు శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

కోర్టు ఏర్పాటు చేయాలి

మోత్కూరు, జూలై 31: యాదాద్రి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలో మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు, తుంగతుర్తి, అడ్డగూడూరు మండల కేంద్రాల్లో ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. ఈమేరకు అసెంబ్లీ సమావేశ మందిరంలో సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సామేలు

బ్యాంకు ఏర్పాటు చేయించరూ..

మద్దిరాల, జూలై 31: మద్దిరాల మండలాన్ని 2016 అక్టోబరులో ఏర్పాటు చేశారు. ఏడేళ్ల గడిచినా మండల కేంద్రంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు ఏర్పాటు చేయనందున మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి నూ తనకల్ మండలంలో మద్దిరాల గ్రామంలో నాగార్జున గ్రామీణ వికాస్ బ్యాంక్, గోరెంట్ల గ్రామంలో ఆంధ్రా బ్యాంక్(యూనియన్ బ్యాంక్) ఉండేది. ఈ బ్యాంకులను నూతనకల్ మండల కేంద్రానికి తరలించారు. నూతనకల్ మండలంలోని ఎనిమిది గ్రామాలు, తుంగతుర్తి మండలంలోని ఐదు గ్రామాలతో మద్దిరాల మండలాన్ని ఏర్పాటు చేశారు. గిరిజన తండాతో కలిపి మొత్తం 15 గ్రామ పంచాయతీలతో ఈ మండలం ఏర్పాటైంది. మద్దిరాల మండల కేంద్రంలో ప్రభుత్వ రంగ బ్యాంకులేనందున ప్రజలు మద్దిరాల నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న తుంగతుర్తికి, 10కిలోమీటర్ల దూరంలో ఉన్న నూతనకల్ మండలానికి వెళ్లాల్సివస్తోంది. బ్యాంకుకు వెళ్లాలంటే ఎంతో వ్యయప్రయాసలతో ఇబ్బంది పడుతున్నామని రైతులు, విద్యార్థులు, ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా మద్దిరాలలో ఏదైనా ప్రభుత్వ రంగ బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేసి తమ సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



చివ్వెంల: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీ జనరల్ సెక్రెటరీ మోగదాల లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాలను మాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని వల్లభాపురం వల్లబాపురం గ్రామంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కుంభం దర్మయ్య, కుంభం జగన్నాథం, జీడిమెట్ల వెంకన్న, మద్రిపడగ వెంకన్న కర్నాకర్, జానయ్య, ఏల్లయ్య, సైదులు, హుస్సేన్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: సివిల్ సప్లయ్ హమాలీలను అక్రమంగా అరెస్టు చేయడం శోచనీయమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ అన్నారు. సివిల్ సప్లయ్ కార్మికులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ హుజూర్‌నగర్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మల్లయ్య, రామ్మూర్తి, సైదులు, వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● విద్యారంగానికి నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి చందర్‌రావు కోరారు. హుజూర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇవ్వడానికి వెళుతున్న పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులను అరెస్టు చేయడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాజీ, వివేక్, శివ, వంశీ, కార్తీక్, సాయి, ఉదయ్, పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ పట్టణంలోని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్‌కుమార్‌ను కాంగ్రెస్ నాయకుడు మన్సూర్‌అలీ సన్మానించారు. కార్యక్రమంలో సోఫియా పాల్గొన్నారు

హుజూర్‌నగర్ రూరల్: బహుళ ఏకాదశి సందర్భంగా మండలంలోని బూరుగడ్డ వేణుగోపాలస్వామి దేవాలయంలో సహస్రనామ, ఫల, పుష్పార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో పురుషోత్తం, శ్రీలత, సక్కుబాయమ్మ, రాహుల్, మౌనిక, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ మండలంలోని శ్రీనివాసపురానికి చెందిన మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షురాలు మెండెం రమణ మృతి తీరని లోటని బీఆర్ఎస్ నాయకుడు రాపోలు నవీన్ అన్నారు. ఆమె మృతదేహానికి పూలమాలల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నర్సింహారావు, దశరథ, శ్రీను, రామారావు, ప్రసాద్, గోవింద్ పాల్గొన్నారు.

నేరేడుచర్ల: రైతుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు కార్యక్రమంలో యల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాసరెడ్డి, చిలకరాజు శ్రీను పాల్గొన్నారు.

మఠంపల్లి: సైబర్ నేరాలపై బక్కమంతులగూడెం సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోఅవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సాధికారత జిల్లా మిషన్ కోఆర్డినేటర్ చైతన్య, పాఠశాల ఎస్‌వో విజయకుమారి, మహిళ సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టు రేవతి, వినోద్, ఫైనాన్సియల్ లీటరసీ తేజస్విని, విద్యార్థినులు పాల్గొన్నారు.

● మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: వర్షాల కోసం మండల కేంద్రంలోని గురప్ప దేవాలయంలో ఏకనామం భజన కార్యక్రమం నిర్వహించారు. 24 గంటల పాటుగా నిర్విరామంగా గురువారం ఉదయం వరకు కొనసాగుతుందని భగ్గవరపు వంశస్థులు తెలిపారు.

గరిడేపల్లి: మండలంలోని రాయినిగూడెం పీఏసీఎస్‌లో రైతులకు దీర్ఘకాలిక రుణాలు,గేదెల పెంపకం కోసం రూ.7లక్షల విలువైన చెక్కులను ఆ సంఘం చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సాంబయ్య, మంగళగిరి కృష్ణ పాల్గొన్నారు.

● గరిడేపల్లి మండలంలోని మర్రికుంట గ్రామానికి చెందిన బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, దివంగత రామినేని ప్రభాకర్ కుమారుడు రామినేని ఉదయ్‌కుమార్ మృతి బీజేపీకి తీరని లోటని హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. మండలంలోని మర్రికుంట గ్రామంలో ఉదయ్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోకల వెంకటేశ్వర్లు, కుక్కడపు వెంకటేశ్వర్లు, రామినేని అశోక్, చిత్తలూరి సోమయ్య పాల్గొన్నారు.

కోదాడ టౌన్: సైబర్ నేరాలపై పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కోదాడ ఏఎస్ఐ ఏపీ చారి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డి.మార్కండేయ, ఉపాధ్యాయులు, మీనాక్షి, బడుగుల సైదులు, ఖాజామియా పాల్గొన్నారు.

● రిటైర్డు ఉద్యోగుల న్యాయమైన హక్కులను ప్రభుత్వం నెరవేర్చాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య అన్నారు. కోదాడలోని పెన్షనర్స్ భవనంలో కోదాడ యూనిట్ అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు అధ్యర్యంలో నిర్వహించిన రిటైర్డు ఉద్యోగుల సామూహిక పుట్టిన రోజు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, రిటైర్డు డీఈవో హనుమారెడ్డి, అమృతరెడ్డి, ఎమ్.వెంకటేశ్వరరావు, పి. జగన్మోహన్, భ్రమరాంబ, శోభ పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని గుడిబండ గ్రామంలో పౌరహక్కులపై ఏఆర్ఐ సుజిత్‌కుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ రాజేష్, రూరల్ ఏఎస్ఐ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

నడిగూడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఈటీ ఎం.శకుంతల ఉద్యోగ విరమణ సందర్భంగా రూ.20వేల విలువైన వాటర్ ఫిల్టర్, విద్యార్థినులకు జామెట్రీ బాక్సులు, బెల్ట్‌లు ఉచితంగా అందజేశారు., ఈ సందర్భంగా పీఈటీని ఉపాధ్యాయులు, విద్యార్థినులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, రిటైర్డు పీడీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి బోయిని లింగయ్య అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలల పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ చంద్రునాయక్, జీహెచ్‌ఎంలు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, ఉషారాణి పాల్గొన్నారు.

● రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాలను మాఫీ చేసినందుకు రైతులు, రైతు కూలీల ఆధ్వర్యంలో తుంగతుర్తిలోని రైతు పొలంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి మిఠాయి పంచారు. కార్యక్రమంలోనవీన్, ఎల్లయ్య పాల్గొన్నారు.

● తుంగతుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై సీఐ శ్రీనునాయక్ అవగాహన కల్పించారు. షీటీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఏడుకొండలు, నీలిమ, హెచ్‌ఎం సంధ్యారాణి ఉన్నారు.

అర్వపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందజేయాలని ఎంపీడీవో సందీప్ అన్నారు. మండలంలోని కుంచమర్తి గ్రామ ప్రాథమిక పాఠశాల మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. అనంతరం గ్రామంలోని పారిశుధ్య నిర్వహణకు పరిశీలించారు. ఎంపీడీవో వెంట కార్యదర్శి రవీందర్‌రెడ్డి ఉన్నారు.

నూతన్‌కల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కనీస అభ్యాస సామర్థ్యాలు ప్రాథమిక స్థాయిలోనే నేర్పించాలని ఎంఈవో రాములు నాయక్ ఉపాధ్యాయులను కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన్‌కల్, మద్దిరాల మండలాల ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు డి.శివయ్య, షరీపున్నీసాబేగం పాల్గొన్నారు.

● ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కో రైతుకు రూ.1.50లక్షల పంట రుణాలు మాఫీ చేయడం వరం లాంటిదని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. నూతనకల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో కట్టమల్లారెడ్డి, పసుల అశోక్‌యాదవ్, కిరణ్ పాల్గొన్నారు.

● ప్రతి ఒక్కరూ సంవత్సరానికి ఒక మొక్కను నాటి సంరక్షించాలని ఎంఈవో రాములునాయక్, పెదనెమిల కాంప్లెక్స్ హెచ్‌ఎం డి.శివయ్య కోరారు. వన మహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దిరాల: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ కార్యదర్శి సీతామహాలక్ష్మి కోరారు. మద్దిరాల మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మేనిఫెస్టోలో పెట్టిన విధంగా నెలకు రూ.18వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సర్కిల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఏ.సరస్వతి, ప్రధాన కార్యదర్శిగా మంజుల, ఉపాధ్యక్షులుగా విజయలక్ష్మి, మాధవి, శ్రీవాణి, సహాయ కార్యదర్శులుగా టి.అరుణ, నిర్మల, కోశాధికారిగా షాహిదా, గౌరవ అధ్యక్షురాలిగా గురవోలు రమను ఎన్నుకున్నారు.